17వ
సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం,1 జూన్ 2024


## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యా-వైజ్ఞానిక శిక్షణ తరగతులు జయప్రదం చేయండి.



**కాకినాడ, మేజర్ న్యూస్ :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యా-వైజ్ఞానిక శిక్షణ తరగతులు శ్రీకాకుళం జిల్లాలో జూన్ 8 నుండి 15వ తేదీ వరకు జరుగుతున్నాయి. వీటిని జయప్రదం చేయాలని కాకినాడ సుందరయ్య భవన్లో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వరహాలు, ఎం.గంగా సూరిబాబు సంయుక్తంగా మాట్లాడుతూ అధ్యయనం, పోరాటం లక్ష్యాలతో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 1970లో ఏర్పాటయి విద్యారంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా అనేక పోరాటాలు చేస్తూ విద్యార్థుల తరపున నిలబడి వారి హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తుందని, విద్యారంగానికి హానికరమైన ఎన్.ఇ.పి.కి వ్యతిరేకంగా దశలవారీ పోరాటం చేస్తున్నామని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని, అందరికీ ఉచితంగా విద్యను అందించాలని ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర విద్యా-వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదానికి జిల్లా ఉన్న ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జి. శ్రీకాంత్, జిల్లా సహాయ కార్యదర్శి ఏ.వాసుదేవ్, జిల్లా కమిటీ సభ్యులు సాహిత్, గోపాలకృష్ణ, సిద్దు, లోవరాజు, వెంకటేశ్, అరుణ్ కుమార్, చిన్ని వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు హాజరైనారు.

### వైఎస్ఆర్సిపి దుష్ప్రచారాలు

# మానుకోవాలి

**- అన్ని పార్టీల కౌంటింగ్ ఏజెంట్లపై అధికారులు దృష్టి పెట్టాలి**

**- పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ**

**పిఠాపురం,మేజర్‌న్యూస్:** వైయస్ఆర్సీపీ దుష్ప్రచారాలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. పిఠాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మాజీ ఎమ్మెల్యే వర్మ కార్యకర్తలతో సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో వైసీపీ దుష్ప్రచారం ప్రజలు అందరికీ అర్ధమవుతుందని, ప్రజలే ఆశ్చర్యపోతున్నారు, అత్యధిక మెజారిటీతో నెగ్గే పవన్ కళ్యాణ్ ఎలక్షన్ పాడుచేయాలనే దురుద్దేశంతో,కుట్రతో ఉన్నారని, కౌంటింగ్ ప్రక్రియకు ఎదో రకంగా ఆటంకం కలిగించే యోచనలో వైసీపీ ఉందని, ఓటమి భయంతో కుట్రలు చేస్తుందని విమర్శించారు. రౌడీ షీటర్లను కౌంటింగ్ ఏజెంట్స్ గా నియమిస్తుందని, రౌడీ షీటర్లకు బూత్‌లలో స్థానం కలిపించడం వలన కౌంటింగ్ రోజున నిలుపుదల చేయడానికి, గొడవలు జరగడానికి అవకాశం ఉంటుందని, వారిని గుర్తించి రిజెక్ట్ చేసినచో 4వ తారీఖున ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు కౌంటింగ్ జయప్రదం అవుతుందని, ఏ పార్టీకి చెందినా వారైన సరే కౌంటింగ్ ఏజెంట్స్ ఎటువంటి నేరాలకు పాల్పడ్డారో గుర్తించి వారిపై ఒక రిపోర్ట్ ఈరోజే ఇవ్వాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా ఎస్పీ వారిని కోరుతున్నామన్నారు.



వైసీపీకి చెందిన రౌడీ మూకలు ఇండిపెండెంట్‌ల వద్ద కౌంటింగ్ ఏజెంట్స్ ఫారం తీసుకొని కౌంటింగ్ ఏజెంట్స్ రావడం జరుగుతుంద న్నారు. అదే విధంగా వైసీపీ కౌంటింగ్ ఏజెంట్లకు సజ్జల రామకృష్ణ రెడ్డి సూచనలే ఇందుకు నిదర్శనమని, ఎన్నికలు కమిషన్ వైసీపీ కౌంటింగ్ ఏజెంట్స్‌పై దృష్టి సారించాలని కోరారు. ఎన్ని కుట్రలు పన్నినా కూటమి పార్టీ శ్రేణులు సమర్ధవంతంగా ఎదురుకుంటామని పేర్కొన్నారు.

### కాకినాడ ఐడిఏ ఆధ్వర్యంలో

## 'ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం"

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక వలసపాకలలోని ఎ.ఎమ్.ఎమ్ ఫౌండేషన్ ఆసుపత్రిలో కాకినాడ ఐడిఏ సభ్యుల ఆధ్వర్యాన ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా నోటి కేన్సర్ పైన అవగాహన మరియు వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ ఐడిఏ అధ్యక్షుడు డా. నాగేంద్ర మాట్లాడుతూ ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం రోజు డబ్ల్యుహెచ్‌వో, పొగాకు వాడకం వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాల గురించి అవగాహన కల్పిస్తుంది అని మరియు ప్రజారోగ్యాన్ని, ముఖ్యంగా యువతలో రక్షణ కోసం కఠినమైన చర్యల కోసం కార్యాచరణ చేపడుతున్నదని అన్నారు. రాష్ట్ర ఐడిఏ సిడిహెచ్ కన్వీనర్ డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ 2024 యొక్క థీమ్ "పొగాకు పరిశ్రమ జోక్యం నుండి పిల్లలను రక్షించడం" అని, హానికరమైన ఉత్పత్తులతో యువతను లక్ష్యంగా చేసుకోకుండా పొగాకు పరిశ్రమను నిరోధించడం మరియు మానిప్యులేటివ్ పద్ధతుల నుండి వారిని రక్షించే విధానాలను ప్రోత్సహించడంపై దృష్టి సారించిందని, పొగాకు పరిశ్రమ తన లాభాలను కొనసాగించడానికి యువతను లక్ష్యంగా చేసుకుంటుందని, తరచుగా సడలింపు నిబంధనలు, ప్రకటనల వ్యూహాలు మరియు ఇ-సిగరెట్‌ల పెరుగుదల ద్వారా, పొగాకు ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం మరియు పొగాకు మరియు సంబంధిత పరిశ్రమల నుండి పిల్లలను రక్షించే విధానాలను అనుసరించేలా ప్రభుత్వాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ తరచుగా ప్రాణాంతకం అని, దగ్గు, ఛాతీ నొప్పి మరియు బరువు తగ్గడం వంటి లక్షణాలతో జీవన నాణ్యత మరియు మనుగడ రేటును గణనీయంగా తగ్గిస్తుంది అని, క్రానిక్ అబ్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సిఓపిడి) పొగ వాయుమార్గాలను చికాకుపెడుతుంది మరియు ఊపిరితిత్తుల కణజాలాన్ని నాశనం చేస్తుంది, ఇది దీర్ఘకాలిక బ్రోన్కైటిస్ మరియు ఎంఫిసెమాకు దారితీస్తుంది. నిరంతర దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది మరియు తరచుగా శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు కారణమవుతుంది,




శారీరక శ్రమ మరియు జీవన నాణ్యతను తీవ్రంగా పరిమితం చేస్తుంది. పొగాకు పొగలోని రసాయనాలు రక్త నాళాలను దెబ్బతీస్తాయి, ఇది అథెరోస్క్లెరోసిస్ (ధమనుల గట్టిపడటం)కి దారితీస్తుంది, ఇది రక్త ప్రవాహాన్ని మరియు గుండెకు ఆక్సిజన్ సరఫరాను తగ్గిస్తుంది. గుండె పోటు, ఆంజినా (ఛాతీ నొప్పి) మరియు గుండె వైఫల్యం ప్రమాదాన్ని పెంచుతుంది, అధిక మరణాలు మరియు రోగాల రేటుకు దోహదం చేస్తుందిఅనితెలిపారు.డా.పద్మావతి మాట్లాడుతూ"ఆరోగ్యంపై పొగాకు వల్ల కలిగే హానికరమైన ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, ధూమపానం చేసేవారిని విడిచిపెట్టేలా ప్రోత్సహించడం మరియు పొగతాగే అలవాటు లేని వారిని రక్షించడం కోసం ఇది ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే వార్షిక కార్యక్రమం అని అన్నారు. ఆనంతరం ధూమపానం మానివేయాలనుకునేవారికి నికొటెక్స్ చూయింగ్ గమ్స్‌ని పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో డా. చైతన్య, డా. సిరాజ్, డా. స్వరూప్, డా.దీప,ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

### మరిడమ్మ అమ్మవార్కి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన



**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ మోహనరావు ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవారిని బంగారు పుష్పాలు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, ఎన్.వి.శేఖర్, ఆసాదులురాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది కె.వి.డి.ప్రసాద్, వరహాలు, క్రాంతివీర్, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.


### పెద్దాపురం మండలంలో ఫించన్ల పంపిణికి ఏర్పాట్లు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జూన్ నెలకు సంబంధించి సామాజిక ఫించన్లు లబ్దిదారులకు అందించే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపిడిఓ ఎం.ఉషారాణి తెలిపారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఆమె విలేఖరులతో మాట్లాడుతూ పెద్దాపురం మండలంలో 11,888 ఫించన్లకు గాను రూ.3,47,34,000/- లు విడుదల అయ్యాయని వీటికి సంబంధించి డిబిటి ద్వారా 8,417 మంది ఫించనుదారులకు రూ.2,52,51,000/-లు లబ్దిదారులకు వారి యొక్క బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు ఆమె తెలిపారు. అలాగే మిగిలిన 3,471 మందికి (వృద్దులు, దివ్యాంగులు, బెడ్ రిడెన్) రూ.94,83,000/-లు మండలంలోని ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది ద్వారా ఫించనుదారుల ఇంటికి వెళ్ళి ఫించను డబ్బులు అందజేయడం జరుగుతుందని ఎంపిడిఓ తెలిపారు.

### లంగారు తాడు తెగి బోటు ధ్వంసం

**- రూ.4 లక్షల నష్టం**



**యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్ :** వేట నిషేధ సమయం కాబట్టి బోట్లని రామన్నపాలెం బ్రిడ్జి వద్ద మత్స్యకారులు లంగార్లు (తాళ్లు కట్టి) వేసి నిలిపివేశారు. శుక్రవారం తెల్లవారుజామున ఉప్పాడకు చెందిన ఉమ్మిడి జగన్నాథం అనే మత్స్యకారుడు బోటు తాడు తెగిపోవడంతో పక్కనే ఉన్న రాళ్లుగుట్టను ఢీ కొట్టింది. దీంతో బోటు అడుగుభాగం పూర్తిగా ధ్వంసం అయిందని బాధిత మత్స్యకారుడు జగన్నాథం తెలియజేశాడు. బోటు పూర్తిగా ధ్వంసమై సుమారు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు జగన్నాథం ఆవేదన వ్యక్తం చేశాడు.

# కౌంట్ డౌన్ ప్రారంభం

### - నేతలకు పోలీసుల నోటీసుల పర్వం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** సార్వత్రిక ఎన్నికలు ఈ నెల 13న ముగిసాయి. కౌంటింగ్‌కు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. మూడు రోజుల సమయం మాత్రం ఉంది. 4న కౌంటింగ్. ఇలాంటి నేపథ్యంలో కాకినాడ జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. కౌంటింగ్ సమయంలో పలితాలు తెలిసిన తర్వాత ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా కాకినాడ, పెద్దాపురం డిఎస్పి ల పరిధిలో సెక్షన్ 30 అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా నియోజకవర్గాలు, మండలాలు, పట్టణాలు, కాకినాడ నగరం, గ్రామాల్లో ఉన్న అన్ని పార్టీల నాయకులకు నోటీసులు అందజేస్తున్నారు. ఆరో తేదీ వరకు సెక్షన్ 30 అమల్లో ఉన్నందున అనుమతులు లేకుండా ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలు, సభలు నిర్వహించడానికి లేదు. అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ఆయా పోలీసు స్టేషన్ల ఎస్ఐలు నేతలకు నోటీసులు జారీ చేస్తున్నారు. కాకినాడ జిల్లాకు సంబంధించి ప్రధానంగా కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పిఠాపురం పైనే అందరి కళ్ళు ఉన్నాయి. పిఠాపురంకి సంబంధించి ముద్రగడ పద్మనాభాన్ని టార్గెట్ చేశారు. పవన్ కళ్యాణ్ ఓడిపోతాడని, గెలిస్తే తన పేరు పద్మనాభ రెడ్డిగా మార్చుకుంటానని ఆయన సవాల్ విసిరారు. దీంతో పిఠాపురంలో ఉద్రిక్తత నెలకొనే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. అక్కడ 144 సెక్షన్ కూడా విధించారు. ఇలాంటి నేపథ్యంలో అన్ని పోలీసు స్టేషన్ల ఎస్సైలు తమ సిబ్బంది ద్వారా నోటీసులు పంపించి అందుకనుగుణంగా వారితో సంతకాలు తీసుకుంటున్నారు. ఇప్పుడు ఇది చర్చనీయాంశం గా మారింది. తమకు నోటీసులు ఇస్తున్నారా, బైండోవర్ కేసులు పెడుతున్నారా అంటూ నాయకులు ప్రశ్నిస్తున్నారు. మూడు రోజుల సమయం మాత్రమే ఉండడంతో జిల్లాలో కేంద్ర అదనపు పోలీసు బలగాలు మోహరించాయి. లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు ఏపీఎస్పీ పోలీసులు కూడా పహారా కాస్తున్నారు. మొత్తం మీద జిల్లాను పోలీసులు తమ అదుపులోకి తీసుకుంటున్నారు.

## వర్షాకాలం వ్యాధులపై అవగాహన కల్పించాలి- ఎంపిడిఓ





**అల్లవరం,మేజర్‌న్యూస్ :** స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్ ఏ.ఎన్.ఎం. లు, మహిళా పోలీస్‌లు వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య సహాయకులకు సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం అవుతున్నందున ఏ.ఎన్.ఎం.లు వర్షా కాలంలో సంభవించే సీజనల్ వ్యాధులు నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని,కాచి చల్లార్చిన నీరు త్రాగడం, కుళ్లిన మాంసం, చేపలు వంటివి తినరాదని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలనే జాగ్రత్తలు గురించి చెప్పాలని ఆదేశించారు. మే 31 పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని పురుష సచివాలయం సిబ్బందితో పొగాకు ఉత్పత్తులు వాడము అని ప్రతిజ్ఞ చేయించారు. మత్స్యకారులకు వేట నిషేధం సమయానికి ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారం అర్హులు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని మత్స్య సహాయకులను ఆదేశించారు. ఓడలరేవు సముద్ర తీరానికి ఆదివారాలు వచ్చే మహిళా పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విజిబుల్ పోలీసింగ్ చేయాలని మహిళా పోలీసులను ఆదేశించారు. రైతులకు విత్తన శుద్ధి, మొలక పరీక్షలపై అవగాహన కల్పించాలని వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. జూన్ 1న డోర్ టు డోర్ పింఛన్ల పంపిణీలో అందరూ పాల్గొని మొదటి రోజే అత్యధిక శాతం పింఛన్లు పంపిణీ చేయాలన్నారు.ఈ సమావేశంలో ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది సుబ్బలక్ష్మి, ప్రశాంత్ కుమార్, సచివాలయం ఉద్యోగులు శైలజ, రాజ్య లక్ష్మి, రాము, ఇందిర, షేక్ బిలాల్, రమేష్ బాబు తదతరులు పాల్గొన్నారు.

## డైరెక్టర్ సానా బుచ్చిబాబుకి పితృవియోగం



**యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్:** సినీ డైరెక్టర్ సుకుమార్ అసిస్టెంట్ డైరెక్టర్ గా కెరియర్ ప్రారంభించి. అనంతరం మెగా కుటుంబ సభ్యులతో కలిసి ఉప్పెన సినిమాతో పరిచయమై రెండు రాష్ట్రాల్లోనూ తనకంటూ ప్రత్యేకత సంపాదించుకున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి గ్రామ వాస్తవ్యులు సినీ డైరెక్టర్ సానా బుచ్చిబాబుకు పితృవియోగం కలిగింది. గురువారం సాయంత్రం ఆయన తండ్రి సానా వెంకట్రావు పెదకాపు (65) అనారోగ్య కారణంతో హైదరాబాద్ ప్రైవేట్ హాస్పిటల్‌లో వైద్యం పొందుతూ మృతి చెందారు. అనంతరం ఆయన భౌతిక కాయాన్ని తన స్వగ్రామమైన కొత్తపల్లి గ్రామానికి శుక్రవారం ఉదయం తీసుకువచి అనంతరం అంతిమయాత్రగా స్మశానవాటికకు తీసుకువెళ్లారు. సినీ డైరెక్టర్ సుకుమార్ సినీ దర్శకుడు సాన



బుచ్చిబాబు తండ్రి సాన వెంకట్రావు (పెద్దకాపు) భౌతిక కాయంను సందర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. స్మశానంలో ఉన్న సాన పెద్దకాపు భౌతిక కాయాన్ని పలువురు సందర్శించి, డైరెక్టర్ బుచ్చిబాబును ఓదార్చారు. ఆయనతోపాటు సినీ అసిస్టెంట్ డైరెక్టర్ అన్నిశెట్టి సూర్య ప్రకాశ్ రెడ్డి, సినీ నటులు కిల్లి క్రాంతి, తోటి అసిస్టెంట్ డైరెక్టర్లు, కొత్తపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలు తప్పక పాటించాలి



**అల్లవరం, మేజర్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్ కుమార్ ఆదేశాలతో అమలాపురం డిఎస్పి ఎం.మహేశ్వరరావు పర్యవేక్షణలో అల్లవరం ఎస్సై హరీష్ కుమార్ శుక్రవారం కొమరగిరిపట్నం గ్రామపంచాయతీ వద్ద ఇరు పార్టీ నాయకులతోజూన్ 4వ తేదీన ముమ్మిడివరం శ్రీనివాస్ ఇంజనీరింగ్ కాలేజీలో ఎలక్షన్ కౌంటింగ్‌కు సంబంధించిన కొన్ని అంశాలను ఎస్ఐ హరీష్ కుమార్ వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో ఆరోజు కౌంటింగ్ రోజున బూత్ ఏజెంట్లు తప్ప మిగతావారు ఎవరు అక్కడికి రాకూడదని సూచించారు. అలాగే ఏ పార్టీ క్యాండిడేట్ నెగ్గిన తర్వాత బాణసంచా కాల్చడం గాని, ర్యాలీ చేయరాదని సూచించారు. అట్టి పరిస్థితుల్లో ఎవ్వరు చేసిన కఠిన చర్యలు తప్పవని వివరించారు. గ్రామ సర్పంచ్, టిడిపి, వైసిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు. కొందరు నాయకులు మాట్లాడుతూ ఎస్సై హరీష్ కుమార్ సూచన మేరకు మేము ఎవరము కూడా తప్పు చేయమని, మేము మీ మాటకు కట్టుబడి ఉంటామని కొమరగిరిపట్నంనాయకులుహామీ ఇచ్చినారు. అందరూ కలిసిమెలిసి ఉంటామని కొమరగిరిపట్నం గ్రామ ప్రజలు హామీ ఇచ్చారు.

### పిసిసి ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు




**పెద్దాపురం మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలోని స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ (పిసిసి) ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి బాలనేత్ర బంధు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షలను పిసిసి గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్ ప్రారంభించారు. శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది హరిబాబు, హైమ, ప్రశాంత్, సుకన్య, సత్యనారాయణ, శ్రీను, ప్రొగ్రామ్ మేనేజర్ శివ గణేష్, తదితరులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కంటి పరీక్షలలో విద్యార్ధులతో పాటు వారి తల్లితండ్రులకి కంటి పరీక్షలు నిర్వహించి, రెండు రోజులలో కళ్ళజోళ్ళు ఉచితంగా అందజేయడం జరుగుతుందని పిసిసి నిర్వాహకులు తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులకు నృత్యంలో శిక్షణ, క్విజ్ పోటీలు, డ్రాయింగ్, దూదితో బొమ్మలు తయారుచేయడం, కర్రసాము నేర్పించడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుంగల పూజిత సూర్యశ్రీ, పిసిసి అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ కుమార్, సభ్యులు సత్య, మంజుల, పూజిత, మణికంఠ, బంగారం, సాయి, సాయిరామ్, పవన్, రవికుమార్, దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ ఏఈ రామచంద్రారెడ్డికి పదవీ విరమణ వీడ్కోలు సభ



**పెరవలి,మేజర్‌న్యూస్:** పెరవలి మండలంలో పంచాయతీరాజ్ ఏఈ గా పనిచేస్తు మే 31వ తేదీ శుక్రవారం పదవి విరమణ చేసిన పి రామచంద్రారెడ్డికి పెరవలి ఎంపీడీవో ఆఫీస్ తరపున ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమామహేశ్వరి తోపాటు మండల పరిషత్ సిబ్బంది,పంచాయతీ కార్యదర్సులు, పెరవ మండలంలోని ఇంజినిరింగ్ అసిస్టెంట్‌లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధూమపానంతో అనారోగ్య సమస్యలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ధూమపానంతో శరీరంలో అనేక దుష్పరిణామాలు సంభవించి ప్రాణాలకే ప్రమాదమని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి అని మాట్లాడారు. పొగాకు వినియోగం యుక్త వయసులో సరదాగా మొదలై వయసు పెరుగుతున్న కొద్దీ వదిలించుకోలేని వ్యసనంగా మారి పలు దీర్ఘకాలిక వ్యాధులకు కారణం అవుతుందని అన్నారు. పొగాకులో నికోటిన్ తదితర హానికరమైన రసాయనాల వల్ల శ్వాసకోశ లోపలి పొరలు దెబ్బతింటాయని డాక్టర్ అడ్డాల తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్ధ రాజు సత్యనారాయణ రాజు, ఎస్.శ్రీ నగేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ కార్డులు ద్వారా వైద్యం అందించాలి





### - ఏఎస్‌ఆర్ జిల్లా కోఆర్డినేటర్ డేవిడ్

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఆరోగ్యశ్రీ కార్డులు ద్వారా ప్రజలకు మంచి వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని అరకు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ టి.డేవిడ్ సూచించారు. రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌లో శుక్రవారం ఏఎస్‌ఆర్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ టి.డేవిడ్ ఆరోగ్యశ్రీకేసులు గురించి ఆరోగ్య మిత్రలకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ఆసుపత్రిలో కేసులు గురించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ డేవిడ్ మాట్లాడుతూ మొత్తంకేసులు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎవరికీ అయితే కార్డు ఉండదో వారికి అవగాహన కల్పించి, ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా ప్రతీ కేసు పెట్టాలన్నారు. ప్రతీ మాసం 9వ తేదీన జరిగే గర్భిణీ ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్‌లో భాగంగా చుట్టుప్రక్కల గ్రామాలలో ఉన్నవారు హాస్పిటల్‌కి వచ్చినప్పుడు అందరికి అవగాహన కల్పించి ఉచితంగా ట్రీట్మెంట్ మరియు స్కానింగ్ చేసి రక్తపరీక్షలు జరిగే విధంగా ప్రతీ కేసు ఆరోగ్య శ్రీలో కంపల్సరీ చెయ్యాలని సూచించారు. ముఖ్యంగాఆసుపత్రిలో ఎముకలు విభాగంలో కేసులు బాగా చేయాలని కోరారు. ఎక్కువ గా కేసులు చేస్తే ఆరోగ్య శ్రీ నుంచి హాస్పిటల్ అభివృద్ధి కి మేలు జరిగే విధంగా ఉంటుంది అని ఆయన తెలియజేసారు. ఈ కార్యక్రమంలోఆరోగ్యశ్రీసిబ్బంది, హాస్పిటల్ డాక్టర్స్ పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ రోడ్డు తవ్వకం

### - రైతులు గ్రామస్తులు అడ్డగింపు



**అల్లవరం,మేజర్‌న్యూస్ :** కొమరగిరిపట్నం గ్రామపంచాయతీ ఆర్డబ్ల్యూఎస్ చెరువునకు నూతనంగా మంజూరైన పైపులైన్లను కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో ప్రహ్లాద స్వామి ఆశ్రమం వద్ద పిఆర్ రోడ్డునకు గండిపెట్టి పైప్‌లైన్ పనులను చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, గ్రామస్తులు మాట్లాడుతూ ఆర్డబ్ల్యూఎస్ చెరువునకు ప్రత్యేక బోధి ఉన్నదని, దానిద్వారా పైపులైను వేసుకున్నట్లయితే మంచిదని, ఈ పంచాయతీరాజ్ రోడ్డును ఎన్నో సంవత్సరాలు పోరాడిన తర్వాత సాధించుకున్నామని, ఈ రోడ్డు తవ్వడం వలన ఇరిగేషన్ బోదికి అంతరాయం, పంచాయతీరాజ్ రోడ్డు పూర్తిగా ధ్వంసం అవుతున్నదని ఇబ్బందిగా ఉంటుందని దీనివలన ప్రజలకు ఇబ్బందిగా ఉంటున్నదని, దీనిపై సంబంధిత శాఖల అధికారులు స్పందించి, రైతులకు ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆర్డబ్ల్యూఎస్ పైపులైను నిర్మాణం చేయాలని తెలియజేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పైపుల నిర్మాణం చేపడతామని తెలియజేశారు.

## స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించిన ఆర్వో



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే.వెంకటరావు శుక్రవారం స్ట్రాంగ్ రూమ్ లను సందర్శించారు. రోజువారీ తనిఖీలలో భాగంగా స్థానిక జేఎన్టీయూకే ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్ భద్రతను ఆయన పర్యవేక్షించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం కౌంటింగ్ సెంటర్‌ను కూడా సందర్శించారు. అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. నిరంతరం సీసీ కెమెరాలు నిఘా కూడా ఉంటుందన్నారు. భద్రతను నిరంతరం పర్యవేక్షించేందుకు ఇద్దరు గెజిటెడ్ అధికారులను కూడా నియమించామన్నారు. కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే.వెంకటరావు వెంట పలువురు ఎన్నికల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## జగ్గంపేట ఎస్సై నాగార్జున రాజు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఐపీఎస్ ఉత్తర్వులు మేరకు శుక్రవారం జగ్గంపేట ఎస్సై నాగార్జున రాజు ఆధ్వర్యం లో జగ్గంపేట మెయిన్ రోడ్డులవాహన తనిఖీలు నిర్వహిం చారు. ఈ వాహన తనిఖీలలో సరైన ధ్రువపత్రా గ్గలు లేని పలు ద్విచక్ర వాహ నాల ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. 2024 అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎక్కడ ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు చోటు చేసుకోకుం డా ముందస్తు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్నారు.

## గురుకుల కళాశాలల్లో కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని డా. బి.ఆర్.అంబేద్కర్ గురుకుల బాలుర, బాలికల కళాశాలల్లో 2024-25 సం॥లో ఇంటర్మీడియేట్ ప్రథమ ప్రవేశానికి మొదటి, రెండవ విడతల ప్రవేశాల అనంతరం మిగిలి ఉన్న సీట్లకు ఈ నెల 30న బాలురకు, 31న బాలికలకు కాకినాడ సాంబమూర్తి నగర్‌లో గల డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పించినట్లు సంస్థ జిల్లా సమన్వయాధికారి జి.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 6 బాలుర కళాశాలల్లో 83 సీట్లకు 53 సీట్లు భర్తీ చేసినట్లు, అలాగే 14 బాలికల కళాశాలల్లో గల 97 సీట్లకు 97 సీట్లు భర్తీ చేసినట్లు తెలిపారు. అలాగే ప్రతి కళాశాలకు ఆయా గ్రూపుల్లో వెయిటింగ్ లిస్టు కూడా ఇవ్వడం జరిగింది. బ్రాగ్ సెట్ 2024 ప్రవేశ పరీక్ష వ్రాసి ఇప్పటికే ప్రవేశం పొందనివారికి ముందుగా ప్రవేశాలు కల్పించినట్లు, అప్పటికీ మిగిలి ఉన్న సీట్లను సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు స్పాట్ అడ్మిషన్స్ కౌన్సెలింగ్ లో 10వ తరగతిలో వచ్చిన మార్కుల మెరిట్ ద్వారా ప్రవేశాలు కల్పించినట్లు తెలియజేశారు. కౌన్సిలింగ్ లో జిల్లా అడ్మిషన్ కమిటీ సభ్యులు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్ సహాయ సిబ్బంది, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాల నుండి విద్యార్థులు తల్లిదండ్రుల పాల్గొన్నారు.

## వేసవి విజ్ఞాన శిబిరంలో పేపర్ క్రాఫ్ట్, స్పోకెన్ ఇంగ్లీష్ లలో శిక్షణ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కుళాయి చెరువు పార్క్‌లో గల కాకినాడ గాంధీనగర్ శాఖా గ్రంధాలయంలో మే 15 నుండి జూన్ 7వ తేదీ వరకు నిర్వహించబడుతున్న వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా 16వ రోజు అయిన శుక్రవారం నాడు పాఠశాల విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్, స్పోకెన్ ఇంగ్లీష్ మరియు డ్యాన్సులలో శిక్షణ ఇవ్వడం జరిగిందని లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు తెలియజేశారు. పాఠశాల విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ ఈమని మూర్తి ఇంగ్లీష్ లాంగ్వేజ్ టెస్ట్ నిర్వహించడం జరిగిందన్నారు. ఏ.పద్మావతి విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంజీ పాఠశాల విద్యార్థి ఎన్.రామ్ చరణ్ శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న ముచ్చటైన కథలు, పుస్తకంలోని కథలను చెప్పడం జరిగిందని తెలియజేశారు.

## ఉద్యోగ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తే ప్రత్యేక గుర్తింపు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ఉద్యోగ బాధ్యతలను సమ ర్ధవంతంగా నిర్వర్తించిన వారిని అందరికీ గుర్తుం టారని జగ్గంపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలల అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఒమ్మి రఘురామ్ అన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా పని చేసిన ఈ.చంద్రనా యుడు పదవి విరమణ సభ కళాశాల ఆవరణంలో జరిగింది. ఈ సంధర్భంగా నిర్వహించిన సభలో రఘురామ్ మాట్లాడుతూ నీతి నిజాయితీ తో పనిచేసిన వ్యక్తి చంద్రనాయుడు అని, విద్యార్థుల భవిష్యత్తు కోసం పాటుపడిన వ్యక్తి అని కొనియాడారు. స్కిల్ డవల్మెంట్ కోర్సులు తీసుకువచ్చారని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కంపెనీలను తీసుకువచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఆనంతరం చంద్ర నాయుడు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ మెంబార్స్ కొత్త వెంకటేశ్వరరావు, పాలకుర్తిసురేష్, చెరుకూరి జయరాజ్, ఉపాధ్యాయులు,కళాశాలసిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెరవలిలో అభయాంజనేయ స్వామి వారి గ్రామోత్సవం

### -ఖండవల్లి అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద రాజాశ్యామల యజ్ఞం

### -ఉసులుమర్రులో 1116 కలశాలతో స్వామికి అభిషేకం



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి సెంటర్లో 16వ నెంబర్ జాతీయ రహదారి ప్రక్కన ఉన్న అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా 33 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు మే 31వ తేదీ శుక్రవారం నుండి జూన్ మూడో తేదీ సోమవారం వరకు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు సలారి కృష్ణమూర్తి మేజర్ న్యూస్ కు తెలియజేశారు ఈ ఉత్సవాల్లో భాగంగా మే 31వ తేదీ శుక్రవారం నాదస్వర రామడోలు మేళతాళాలతో అత్యంత వైభవంగా పెరవలి గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. జూన్ ఒకటో తేదీ శనివారం ఉదయం లక్ష తమలపాకులు పూజ గంధం సింధూరం పూజ ఆకుల వెంకటేశ్వరరావు దంపతులచే జరుగుతాయని జూన్ రెండో తేదీ ఏకాహం కార్యక్రమం జూన్ మూడో తేదీ అన్న సందర్భంగా జరుగుతాయని సలాది కృష్ణమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మాణిక్ రెడ్డి మురళీకృష్ణ నాగిరెడ్డి నాగేశ్వరరావు సలాది శ్రీహరి సుందర సత్యనారాయణ తాయి చక్రపాణి బొడ్డు రామాంజనేయులు ఆకుల రామారావు తదితరులు పాల్గొన్నారు. ఖండవల్లి గ్రామంలో వడలి ముక్కామల రహదారి ప్రక్కన వేంచేసి ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలు లో భాగంగా మే 31వ తేదీ శుక్రవారంఖండవల్లి సూర్యనారాయణ చార్యులు ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త ప్రోత్సాహకులు భూపతిరాజు వరాహ వెంకట సూర్యనారాయణ రాజు (కృష్ణ) హైమా సూర్యకుమారి దంపతుల ఆధ్వర్యంలో భూపతిరాజు భాస్కర్ మోహిత దంపతులు భూపతిరాజు సత్య సుబ్రహ్మణ్య రాజు ల ఆధ్వర్యం లో రాజశ్యామల యాగం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భూపతిరాజు బుచ్చి రామచంద్రరాజు (దత్తుడు రాంబాబు) ఆంజనేయస్వామి గుడి పురోహితుడు రాంబాబు, గోపాల్, డి సి ఎం ఎస్ మాజీ అధ్యక్షుడు భూపతిరాజు రవివర్మ, ఖండవల్లి గ్రామ ఉపసర్పంచ్ అతికాల కృష్ణమ్మ, మైపాల ప్రసాద్, రెడ్డి సత్యనారాయణ, పెరవలి మండలం లైన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు భూపతిరాజు బుచ్చి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు. ఉసులుమర్రు గ్రామంలోఅభయాంజనేయ స్వామిఉత్సవాల లో భాగంగా మే నెల 31వ తేదీ శుక్రవారం గ్రామంలోని మహిళలు బిందెలతో 1116 కలసాలతో గోదావరి జలాలను తెచ్చి స్వామివారికి పుష్కర మహా కుంభాభిషేకం చేశారు. తదుపరిపంచామృతాభిషేకం మహా కుంభ నివేదనకార్యక్రమం నిర్వహించారు. పెరవల్లి మండల వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాల్లోనూ హనుమజ్జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.

## కలెక్టరేట్ పరిపాలనాధికారి రామారావు పదవి విరమణ

### -రామారావు మహాలక్ష్మి దంపతులకు సన్మానం



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** గత ఏడాది కాలంగా ఎన్నికల ప్రక్రియ సందర్భంలో పరిపాలన అధికారిగా బి వి ఎస్ రామారావు కీలకమైన బాధ్యతలు నిర్వహించడం జరిగిందనీ జిల్లా కలెక్టర్ డా కె. మాధవీలత పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు హాజరయ్యారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన జీవనం గడుపుతూ పదవి విరమణ చెయ్యడం అదృష్టం అని పేర్కొన్నారు. రానున్న రోజులలో ఇంకా మంచి ఆరోగ్యంతో ఉండాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలియ చేస్తూ, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియ చేశారు. జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్ మాట్లాడుతూ , రెవిన్యూ సర్వీసులో వత్తిడినీ అధిగమించి రామారావు పూర్తి స్థాయిలో సేవలు అందించడం జరిగిందన్నారు. పదవి విరమణ చేయనున్న సందర్భంలో శుభాకాంక్షలు తెలియ చేశారు. ఇకపై కుటుంబ సభ్యులతో గడపడం, చిరకాల స్వప్నం నెరవేర్చడానికి పదవి విరమణ తదుపరి ఒక మంచి అవకాశం అన్నారు. జిల్లా రెవెన్యూఅధికారి జి. నరసింహులు మాట్లాడుతూ, బల్లంకి వెంకట సీతా రామ రావు 1988 లో రెవిన్యూ సర్వీసులో రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జాయిన్ అయిన తర్వాత రెవిన్యూ ఇన్స్పెక్టర్ గా, సీనియర్ అసిస్టెంట్ గా కాకినాడ రూరల్, కోటనందూరు డిప్యూటి తహసీల్దార్ సిఎస్డిటీ గా పనిచేశారు. 2023 లో తహశీల్దార్ గా పదోన్నతి పొంది తూర్పు గోదావరి జిల్లాలో పరిపాలన అధికారిగా నియమించడం జరిగిందన్నారు. ఆయన ఇచ్చిన బాధ్యతలు నిర్వహించడంలో చక్కటి పనితీరు నిదర్శనం అన్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, మా కుటుంబంలో నాలుగు తరాలుగా రెవెన్యూ శాఖలో పని చెయ్యడం జరిగిందన్నారు. ఎందరో కలెక్టర్ల మార్గదర్శకత్వంలో పని చెయ్యడం జరిగిందన్నారు. గత 11 నెలల కాలంలో కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ల మార్గదర్శకత్వం లో పని చెయ్యడం పట్ల కృతజ్ఞతలు తెలియ చేశారు. ఈ సందర్భంగా రామారావు ,మహాలక్ష్మి దంపతులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో డి ఆర్వో జి. నరసింహులు, కె ఆర్ సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్ కృష్ణ నాయక్, ట్రైనీ డిప్యూటి కలెక్టర్ ఎం భాను ప్రకాష్, రామారావు కుటుంబ సభ్యులు మధు కిరణ్ దంపతులు , రెవెన్యు విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన పోరాట యోధురాలు సుబ్బమ్మ

### - బీసీ సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** స్వాతంత్ర్య సమరయోధురాలు, సమాజ సేవకురాలు దువ్వూరి సుబ్బమ్మ 60వ వర్ధంతి సందర్భంగా ద్రాక్షారామలో ఆమె చిత్రపటానికి నియోజకవర్గం మైనార్టీ బీసీ సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం యాట్ల మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్ళిన తొలి ఆంధ్ర మహిళ ద్రాక్షారామలో పుట్టి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన సుబ్బమ్మ స్త్రీ జనోద్ధరణకు కృషి చేస్తూనే సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో ఆమె చురుకుగా పాల్గొన్నారన్నారు. రాజమండ్రిలో స్త్రీలకు విద్య నేర్పించడం కోసం పాఠశాల, వసతిని ఏర్పాటు చేసారని తెలిపారు. కాకినాడలో 1923లో జరిగిన స్వాతంత్రోద్యమ సభలో పాల్గొని అనర్గళంగా మాట్లాడిందన్నారు. ఆమె ప్రసంగించే ఉపన్యాసం చాలా దూరం వినిపించేదన్నారు. సుబ్బమ్మ చేసిన సేవలకు గాను 'దేశ భాంధవి' అనే బిరుదు ఇచ్చారని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన పోరాట యోధులు చాలా మంది ఉన్నారని, వారిలో కొంతమందికి గుర్తింపు లేదని, అటువంటి వారందరిని గుర్తించి వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహిస్తానని యాట్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో గంపల వెంకట సోమరాజు, మేడిశెట్టి శ్రీనివాస్, మందాల సత్యనారాయణ, ముద్రగడ శ్రీను, హైదర్ అబ్బాస్, మొహమ్మద్ బాబులు, కొప్పిశెట్టి కొండబాబు, కొండా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


## శ్రీ కృపేశ్వరస్వామివారి దేవస్థానం

దేవాదాయ ధర్మాదాయశాఖ, ఇంజరం గ్రామం, తాళ్ళరేవు మండలం, కాకినాడ జిల్లా

**భూమి కౌలు హక్కునకు టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన**

కాకినాడ జిల్లా, తాళ్ళరేవు మండలం, ఇంజరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కృపేశ్వరస్వామి వారి దేవస్థానంకు చెందిన సంపూర్ణ హక్కు భుక్తములలో గల భూమి ఈ క్రింది చూపబడిన పట్టిక ప్రకారం భూమి కౌలు హక్కుకు 3 సం॥లకు అనగా 2024-25 నుండి 2026-27 వరకు ది.14-06-2024 (శుక్రవారం) ఉదయం 10 గం.లకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షమున ఇంజరం గ్రామం, దేవస్థానం వద్ద శ్రీ తనిఖీదారు, దేవాదాయ ధర్మాదాయ శాఖ, కాకినాడవారి సమక్షంలో బహిరంగముగా వేలం జరుపబడును.

భూముల వివరములు

| వ. నెం. | భూమి ఉన్న గ్రామం | సర్వే నెం. | విస్తీర్ణం య. ట్లు | మెరక లేక పల్లం | ధరావత్తు |
|---|---|---|---|---|---|
| 1. | ఇంజరం | 17/5<br>18/5 | 0.21<br>7.91 | పల్లం<br>" | రూ.10,000/- |
| | మొత్తం | | 8.12 | | |
| 2. | పల్లిపాలెం | 303/1 | 2.21 | పల్లం | రూ.10,000/- |
| 3. | పల్లిపాలెం | 307/4 | 1.41 | " | రూ.10,000/- |
| 4. | లచ్చిపాలెం | 67/7 | 0.70 | " | రూ.10,000/- |
| 5. | కోలంక | 147<br>182/2<br>189/1 | 2.50<br>0.29<br>0.06 | "<br>"<br>" | రూ.10,000/- |
| | మొత్తం | | 2.85 | | |

కాకినాడ
ది.01-06-2024

సెల్ నెం. : 7799614333

సం/- కార్యనిర్వాహణాధికారి
శ్రీ కృపేశ్వరస్వామివారి దేవస్థానం,
ఇంజరం

సూర్య
తూర్పుగోదావరి
శనివారం
1 జూన్ 2024



## ఉజ్జయినిలో జ్యోతుల నెహ్రూ ప్రత్యేక పూజలు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాలు వెలవడనున్న నేపథ్యంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ మహారాష్ట్రలోని ఉజ్జయిని పుణ్యక్షేత్రంలో మహంకాళేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు ఎన్డీఏ కూటమికి అనుకూలంగా వచ్చి కూటమి తరుపున పోటీ చేసిన ప్రతి అభ్యర్థి విజయం సాధిస్తారన్నారు. ముఖ్యంగా రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు ముఖ్యమంత్రిగా, పవన్ కళ్యాణ్ పిఠాపురం శాసనసభ్యుడిగా విజయం సాధించాలని ఆ మహంకాళేశ్వరుడికి పూజలు నిర్వహించామని నెహ్రూ పేర్కొన్నారు. ఆయన వెంట జ్యోతుల అనీష్ నెహ్రూ, పిఏ ప్రసాద్ ఉన్నారు.


## అమ్మవారి మొక్కును తీర్చుకున్న జనసైనికులు



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** మల్లేపల్లి గ్రామం దగ్గరలో కొండపై స్వయంభు అమ్మవారికి మండల కార్యదర్శి పితాని వీరబాబు మొక్కు చెల్లించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాజగ్గంపేట జనసేన ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి రమేష్ జనసైనికులతో కలిసి కొండపై ఉన్నటువంటి అమ్మవారిని దర్శించి అక్కడే ఉన్న ఉన్న పురాతన బావిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ రాబోవు కౌంటింగ్ సంబంధించి ముఖ్య సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాల్లో మలేరియా స్ప్రేయింగ్ చేయాలి







**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రానున్న వర్షాకాలంలో మలేరియా ప్రబలకుండా అన్ని గ్రామాల్లో మందు స్ప్రే చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఏకార్యాలయంసమావేశం హాల్లో ఏ.డి.ఎం. అండ్ హెచ్.ఓ.తోపాటుఅన్నిమండలాలకు సంబంధించిన ఎంపీడీవోలు, మలేరియా సబ్‌యూనిట్అధికారులు, గ్రామపంచాయతీ సచివాలయాల కార్యదర్శులు, డివిజనల్ పంచాయతీ అధికారితో మలేరియా నిర్మూలనపై ప్రాజెక్ట్ అధికారి వీడియో కాన్ఫరెన్స్, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రతీ గ్రామంలో మలేరియా దోమలు ప్రబలకుండా పాగింగ్ చేయాలని ఆదేశించారు. ఏజెన్సీలో ఎన్నిపాగింగ్ మిషన్లు ఉన్నాయి ఎన్ని పనిచేస్తున్నవి, అదేవిధంగాఎన్నిమిషన్లు కొత్తగా వచ్చినవి మండలాలవారీగా ఆయన ఆరా తీశారు. పాగింగ్ మిషన్లు రిపేర్లు ఉన్నవాటిని వెంటనే రిపేర్ చేయించాలన్నారు. ప్రతీ గ్రామంలో జ్వరాలు ఉన్నవారిని రక్త పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన అన్నారు. ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పటివరకు ఎంతమందికి రక్త పరీక్షలు చేసింది, ఎంతమందికి మలేరియా అని వచ్చింది పీహెచ్ఎల్ వారీగా ఆయన ఆరా తీశారు.

పంచాయతీ కార్యదర్శులు ప్రతీ గ్రామంలో పాగింగ్ చేసింది లేనిది ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆయన అన్నారు. డివిజనల్ పంచాయతీ అధికారి, ఎంపీడీవోలు పాగింగ్ నిర్వాహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన అన్నారు. జూన్ 15వ తేదీ నుండి ఏజెన్సీ ఏడు మండలాలలో ప్రతీ ఇంటిలో మలేరియా స్ప్రేయింగ్ రెండో రౌండ్ ప్రారంభమవుతు ందని ఆయన తెలిపారు. ఏజెన్సీ గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా ఎక్కడికక్కడ ముందుజాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలోఏడిఎం అండ్‌హెచ్ఓ జి.శిరీష, ఎంపీహెచ్ఓ రాజు,వీడియో కాన్ఫరెన్స్‌లో డివిజనల్ పంచాయతీ అధికారి రఘు నందన్,ఎంపీడీవోలు హరికృష్ణ, వీర కిషోర్, ఎంపీడీవోలు,సబ్ యూనిట్ అధికారులు, అన్ని గ్రామ సచివాలయాలకు సంబంధించిన కార్యదర్శులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ జలం.... ప్రజారోగ్యం పదిలం

- ప్రతీరోజు ఉదయం, సాయంత్రం త్రాగునీటి సరఫరా
- శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** వేసవిని దృష్టిలో పెట్టుకుని ఎంపిడిఓ ఎం.ఉషారాణి సూచనల మేరకు ఇఓ & పిఆర్‌డి కె.రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామం లోని ప్రజలకు సురక్షితమైన త్రాగు నీరందించడమే లక్ష్యంగా పంచాయతీ యంత్రాంగం పనిచే స్తుందని దివిలి పంచాయతీ సెక్ర టరీ నక్కా సత్యనారా యణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ పెద్దాపురం మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన దివిలి గ్రామం 12 వార్డులతో విస్తరించి ఉందని, అలాగే కూరగాయల మార్కెట్‌గా పెద్ద పేరు ప్రఖ్యాతులు దివిలి మార్కెట్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉండడంతో నిత్యం దివిలి గ్రామ ప్రజలే కాకుండా పరిసర గ్రామాల ప్రజలు కూడా దివిలి గ్రామం మీదుగా వ్యాపారాలు కొనసాగిస్తుండడంతో ప్రజలకు త్రాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్రామంలో 3 ఓహెచ్ఆర్ ట్యాంకుల ద్వారా, ఒక జిఎల్ఆర్ ట్యాంకు ద్వారా రోజుకు 2,40,000 వేల లీటర్ల త్రాగునీటిని ప్రజలకు ఉదయం 6 నుంచి (ఉదయం 3 గంటలు), సాయంత్రం గంటన్నర నిరంతరం ప్రజలకు సరఫరా చేయడం జరుగుతుందని, పంచాయతీ సెక్రటరీ ఎన్.వి.ఎస్.మూర్తి తెలిపారు. అలాగే గ్రామంలోని పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచి చర్యలు తీసుకోవడం జరిగిందని, వాటిలో భాగంగానే 5గురు పంచాయతీ పారిశుధ్య కార్మికులతో డోర్‌టుడోర్ తడిచెత్త, పొడి చెత్త సేకరించి, డంపింగ్ యార్డ్ (చెత్త సంపద కేంద్రం)కు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ 15 రోజులకొకసారి జిల్లా కలెక్టర్ మరియు ఎంపిడిఓ ఆదేశాల మేరకు జిఎల్ఆర్, ఓహెచ్ఆర్ ట్యాంకులను శుభ్రపరచి, ట్యాంకుల వద్ద శుభ్రపరచిన తేదిలను నమోదు చేయడంతో పాటు ప్రతీ పదిరోజులకొకసారి సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రటరీ, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారుల పర్యవేక్షణలో నీటి నమూనాలు సేకరించి పరిశీలించడం జరుగుతుందని, ఈ నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందని పంచాయతీ సెక్రటరీ నక్కా సత్యనారాయణమూర్తి తెలిపారు.

## కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ పదవీ విరమణ

- అధికారికి విరమణ వరం లాంటిది
- డీఆర్ఓ తిప్పే నాయక్




**కాకినాడ, మేజర్ న్యూస్ :** సుదీర్ఘ ఉద్యోగ సర్వీసులో పనిచేసి పదవీ విరమణ చేయడం ఒక వరం లాంటిదని కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి.తిప్పే నాయక్ అన్నారు. సుమారు 37 ఏళ్ల పాటు రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ చేస్తున్న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారి పొన్నమండ శ్రీనివాసరావు అభినందన, సత్కార కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని వివేకానంద హాలులో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా హాజరైన డిఆర్ఓ తిప్పే నాయక్ మాట్లాడుతూ ఉద్యోగి చేరిననాటి నుండి అధికారిగా ఎదిగే క్రమంలో ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయని, అయినా వాటిని ఎదుర్కొని జయించి ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ఎన్నుకోవాలన్నారు. ప్రతీ ఉద్యోగి ప్రజలకు సేవ చేయడమే ఒక బాధ్యతగా ఉండాలన్నారు. అనంతరం పొన్నమండను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పొన్నమండ మాట్లాడుతూ తాను 1987లో అడ్డతీగలలో టైపిస్ట్ ఉద్యోగంతో ప్రారంభించానని అలా అంచలంచలుగా పదోన్నతి తీసుకుంటూ తహశీల్దార్ స్థాయికి రావడం ఆనందంగా ఉందన్నారు. మంచి ఆశయాలు కలిగిన కుటుంబం నుంచి వచ్చానని అందుకే ప్రజలకు సేవ చేయడం తనకు ఇష్టమన్నారు. తన శేషజీవితం భార్య, పిల్లలు, మనవళ్ళతో గడపాలని, అలాగే తనకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ మిగిలిన కాలాన్ని సద్వినియోగం చేసుకుంటానని పొన్నమండ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు పితాని త్రినాధరావు, కార్యాలయం సిబ్బంది దుర్గాప్రసాద్, సుధారాణి, యమున తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌డిఎ కూటమిని కోరుకుంటున్న ప్రజలు

**అగిరిపల్లి,మేజర్ న్యూస్:** అవసరం కోసం నాయకులు కూటమిగా ఏర్పడవచ్చు కాని, రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్‌డిఎగాఏర్పడిన కూటమిని సాధారణ ప్రజలు సైతం మనస్ఫూర్తిగా కోరుకుంటు న్నారని నూజివీడు నియోజకవర్గం బిజిపి కన్వీనర్‌జిఆర్‌కే రంగారావు అన్నారు. శుక్రవారంమేజర్‌న్యూస్తో జిఆర్‌కే మాట్లాడుతూ 2014లో సైతం పవన్ కళ్యాణ్ బయట ఉండి బలపర్చిన భారతీయ జనతా పార్టీ మరియు తెలుగుదేశం పార్టీల కూటమికే ప్రజలుమద్దతు ఇవ్వడం జరిగిందని,కేంద్ర-రాష్ట్రాలలో ఒకే కూటమి అధికారంలో ఉండడం వలన వచ్చేటువంటి లబ్ధిని పూర్తిగా పొందకముందే,ఒక దుష్టశక్తి పన్నినపన్నాగంలో ఇరుక్కుని, దీర్ఘకాలం అనుభవం ఉన్న ఉభయ పార్టీలకు చెందిన నాయకులు అపోహలకు లోనై,తప్పుడు అంచనాలు వేసి, వైఫల్యం చెందడంతో 2019 లో వైస్సార్సీపీ అధికారంలోకి వచ్చే విధంగా ప్రవర్తించారాని పేర్కొన్నారు.దీంతో రాష్ట్రం సర్వ విధాల భ్రష్టు పట్టిందని,తమ తప్పులు తెలుసుకొని, 2024లో కూటమిగా ఏర్పడి-ముఖ్యంగా అశేష,సాధారణ ఆంధ్ర ప్రజలు కోరుకుంటున్న విధంగా పోటీ చేయటంతో,ది04 జూన్ 2024న జరిగే లెక్కింపుతో రాష్ట్రానికి పట్టిన ఒక పెద్దపీడవదిలి పోవడంఅనేదిగ్యారంటీఅనితెలిపారు.తానుకొంతతగ్గి ఈకూటమి ఏర్పడటానికిముఖ్య ప్రోత్సాహకులై నటువంటి పవన్ కళ్యాణ్‌కి మరియు తన శక్తిమేర ఇతోదికంగా కృషిచేసిన రఘురామకృష్ణం రాజుకిఅభినందనలుతెలియపరచారురాబోయేకాలంలో రాష్ట్రంలో నూ-కేంద్రంలోనూ ఏర్పడబోయే ఎన్‌డిఎ కూటమితో రాష్ట్రంలో డబల్ ఇంజిన్ సర్కారు ఏర్పడి,ఇక నుంచి అయినా అభివృద్ధి, సంక్షేమ సమతుల్యంతో పరిపాలన సాగి, రాష్ట్రం అభివృద్ధి చెంది-దేశంలోనే అగ్రగామిగా నిలబడి-అమరావతిరాజధానిగా-ప్రపంచ పట్టణాలలో ఒకటిగా పేరు పొందాలని కోరుకుంటూనాని అన్నారు.

## చదువుకు పేదరికం అడ్డు కాదు

**కైకలూరు,మేజర్‌న్యూస్ :** మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల కైకలూరు వెలమపేట కు చెందిన పూర్వ విద్యార్థినిలు మరడాని శివాని,పందిరి పల్లి శ్యామల 2023-24 విద్యా సంవత్సరంలోట్రిపుల్‌ఐటి సీట్లు సాధించిన నేపథ్యంలో పాఠశాలలో అభినందన సభ ఏర్పాటుచేశారు.ఈసందర్భంగా శివాని,శ్యామలకు పూలమాలలతో దుశాలువాతో ఉపాధ్యాయులు సత్కరించారు. వీరిరువురు ఎన్ ఎం ఎం.ఎస్ లో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకు వచ్చారు. 10వ తరగతి పరీక్షలలో 564,562 మార్కులతో ప్రతిభ కనబరిచారు.ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు దానంప్రసాద్ మాట్లాడుతూ ఇరువురు ఉన్నతమైన లక్షణాలను ఎన్నుకొని ఉన్నత స్థితికి ఎదగాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

## మంచినీటి సమస్య పరిష్కారంలో అధికారులకు చిత్తశుద్ధి కరువైంది

-తూతూ మంత్ర పర్యటనలే తప్ప చర్యలు లేవు

-ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల ధ్వజం



**జగ్గంపేట,మేజర్‌న్యూస్ :** మంచినీటి సమస్య పరిష్కారంలో అధికారులకు చిత్తశుద్ధి కరువైందని తూతూ మంత్రంగా పర్యటించి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ధ్వజమెత్తారు. శుక్రవారం జగ్గంపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26న ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేటలో ప్రెస్ మీట్ జరిగిన మరుసటి రోజు అధికారులు బావారం ప్రాజెక్టు వద్దకు వెళ్లి హడావుడి చేశారే కానీ సమస్య పరిష్కారానికి పూర్తిస్థాయిలో చర్యలకు నోచుకోలేదని విమర్శించారు. సదరు వాటర్ ట్యాంకుల నుంచి పక్కన ఉన్న ఒక భూస్వామి పామాయిల్ తోటకు ఈ నీటిని తరలిస్తున్నారని తెలిసిన దీనిపై కనీసం అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామాల్లో వాటర్ ట్యాంకులు 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లవలసి ఉండగా ట్యాంకులు కూడా శుభ్రం చేయట్లేదన్నారు. రాజకీయ నాయకులు అండదండలతో కాంట్రాక్టర్ ది ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుందన్నారు. తక్కువ మంది సిబ్బందిని పెట్టి పని చేస్తూ ఎక్కువమంది సిబ్బంది పేరు మీద జీతాలు, బిల్లులు తీసుకుంటున్నారన్నారు. బావారం ట్యాంకుల వద్ద శుద్ధి చేసిన మంచినీరు, గ్రామాలలో పంచాయతీ నీరు కలిసి పోతున్నాయని శుద్ధి చేసిన నీటికి ప్రత్యేక ట్యాంకులు ఉండాలని అధికారులు చెబుతున్న స్థానిక సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో గ్రౌండ్ వాటర్ క్లోరైడ్ (సుద్ధ) వాటర్ పడుతుందని, ఆ నీరు ప్రజలు తాగడం వలన అనారోగ్యాల పాలవుతున్నారని వాపోయారు.కాబట్టి గండేపల్లి, జగ్గంపేట మండలాల్లో సి.పి.డబ్ల్యూ.ఎస్ స్కీం ద్వారా అందించే శుద్ధిచేసిన నీరును గ్రామాలకు ప్రత్యేక పైపులైన్లు, వాటర్ ట్యాంకులు నిర్మించి ప్రజలకు శుద్ధిచేసిన మంచినీరు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సి.పి.డబ్ల్యూ.ఎస్ స్కీంలో గత ఐదేళ్లలో జరిగిన, జరుగుతున్న అవకతకలపై జిల్లా ప్రభుత్వ యంత్రాంగం సమగ్రమైన విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఉద్యమం చేపడతామని కర్నాకుల హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ సిఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్టీయు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కుంచే అంజిబాబు, ఏపీఆర్ సిఎస్ జిల్లా నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, దేసెటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవిఎమ్ యూనిట్స్ తీసుకుని రావడం కోసం రూట్ మ్యాప్ సిద్ధం





**రాజానగరం, మేజర్ న్యూస్ :** కౌంటింగ్ కేంద్రాల వద్దకు ఈ వి ఎమ్ యూనిట్స్ తీసుకుని రావడం కోసం రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా కె. మాధవీలత తెలియ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఎస్పి పి జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్ తో కలిసి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలో కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీ లత మాట్లాడుతూ, మొత్తం ఈవిఎమ్ ఓట్లు లెక్కింపు కోసం అసెంబ్లి సిగ్మెంట్ (,పార్లమెంటు) కోసం 98 టేబుల్స్ 116 రౌండ్స్, అసెంబ్లి నియోజక వర్గం కోసం 98 టేబుల్స్ 116 రౌండ్స్ మేరకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అదే విధంగా ఈటిపీబీఎస్ ,పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి టేబుల్ వద్ద ఒక సూపర్వైజర్, సహాయకులు కౌంటింగ్ ప్రక్రియని మైక్రో అబ్జర్వర్స్ నిశితంగా పరిశీలించడం జరుగుతుందనీ అన్నారు. తగిన గుర్తింపు కార్డులు లేని వారిని నన్నయ్య యూనివర్సిటీ లోకి అనుమతించడం జరగదని, ఆమేరకు స్పష్టమైన ఆదేశాలు జారీచేయడం జరిగిందని తెలిపారు. రాజకీయ పార్టీలు,అభ్యర్థులు తరపునజూన్4 న ప్రతిపాదించే కౌంటింగ్ ఏజెంట్స్ వివరాలు ఇవ్వమని ఇప్పటికే తెలియ చెయ్యడం జరిగిందన్నారు. వారికీ సంభందిత రిటర్నింగ్ అధికారి ద్వారా గుర్తింపు కార్డులు, అధికారిక లేఖలు, వారి సంతకాలు నిర్ధారణ చేయనున్నట్లు తెలిపారు. రిటర్నింగ్ అధికారి అధ్వర్యంలో కౌంటింగ్ కేంద్రాలలోకి అనుమతించే వారి గుర్తింపు నిర్ధారణ చేసుకున్న తరువాత మాత్రమే అనుమతించాలని భద్రత సిబ్బందికి తగిన సూచనలు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్ వరకూ వొచ్చే మార్గంలో సీసీ కెమెరాలు మార్గాలను ఎస్పి పరిశీలించారు.

ఈ మొత్తం మార్గంలో మేష్ లు ఏర్పాటు చేసి, అత్యంత జాగ్రత్తగా తీసుకుని వచ్చిన ఈ వి ఎమ్‌లు తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచడం జరుగుతుందనీ తెలిపారు. ఆయా ఈవిఎమ్ యూనిట్స్ తీసుకుని వొచ్చే వారికీ నియోజక వర్గాల వారీగా డ్రెస్ కలర్ కోడ్ ఇస్తూ, అసెంబ్లి, పార్లమెంటు వివరాలు ముద్రించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట ఎస్పి పి జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్, అదనపు ఎస్పీ ఎల్ చెంచు రెడ్డి, ఆర్డీవో చైత్ర వర్షిణి, తదితరులు పాల్గొన్నారు

## పంచకర్ల రమేష్, వంశీ కృష్ణ

## యాదవ్‌లను మర్యాద పూర్వకంగా కలిసిన పిప్పర రవి



**పెరవలి, మేజర్ న్యూస్ :** విశాఖ జిల్లా నుండి ఉమ్మడి కూటమి అభ్యర్థిలుగా పెందుర్తి, విశాఖ సౌత్ నుండి పోటీ చేసిన జనసేన నాయకులు పంచకర్ల రమేష్ బాబు, వంశీ కృష్ణ యాదవ్ లను పెరవలి మండల జనసేన పార్టీ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది పిప్పర రవి మే 31వ తేదీ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లడుతూ నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గా పోటీ చేసిన కందుల దుర్గేష్ తమకు మంచి స్నేహితులు అనీ, మంచి విషయ పరిజ్ఞానం, వాగ్ధాటి కలిగిన నాయకులు అని ప్రశంసించారు.జనసేన నుండి పోటీ చేసిన 21 మంది ఎం.ఎల్.ఏ అభ్యర్థి లు గెలిస్థారు అన్నారు. రాబోయే ప్రభుత్వంలో జనసేన కీలక పాత్ర పోషిస్తుంది అని ఆశాభావం వ్యక్తంచేశారు.ఏదో ఒక సమయంలో నిడదవోలు నియోజకవర్గం కు వస్తామని తెలిపారు. పిప్పర రవి వెంట నియోజకవర్గ నాయకులు పొప్పొప్పో సూర్య నాగేశ్వరరావు , పంతం నాగరాజు, పొప్పొప్పు నాగేశ్వర రావు, పోతురెడ్డి పద్మరాజు, మోహన్ తదితరులు ఉన్నారు.

## జేఎన్టీయూలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ అధికారులను ఆదేశించారు.

సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా కాకినాడ జేఎన్టీయూలో వివిధ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూముల, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్..జిల్లా ఎస్పీ ఎస్.సతీశ్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్ సుందర్ రెడ్డి, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్, డ్వామా, వ్యవసాయ, ఏపీఈపీడీసీఎల్, సమాచార, సర్వే, రోడ్డు భవనాల, పౌరసరఫరాల సంస్థ తదితర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. జేఎన్టీయూ ప్రధాన ద్వారం వద్ద గుర్తింపు కార్డులు తనిఖీ, బస్సుల ద్వారా అభ్యర్థులు కౌంటింగ్ ఏజేంట్ల లెక్కింపు కేంద్రాలకు తరలింపు, పిఠాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట, కాకినాడ పట్టణం, తుని, కాకినాడ రూరల్ నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూముల, కౌంటింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఏర్పాట్లు, భోజనం వసతి, మొబైల్ ఫోన్ల కౌంటర్ స్టాల్స్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుకు సంబంధించిన ఏర్పాట్ల పనులను పరిశీలించి, ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు.

అనంతరం జేఎన్టీయూ వీసీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ ఎన్నికలు-2024కు సంబంధించి జూన్ 4న ఉదయం 8 గంటల నుంచి జేఎన్టీయూలో ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రతిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఇందుకు అధికారులు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని ఆయన సూచించారు. ఉదయం 7 గంటలలోపు అభ్యర్థులు, ఏజెంట్లు అందరూ కౌంటింగ్ కేంద్రాలకు చేరుకునే విధంగా చూడాలన్నారు. ఏజేంట్ల తప్పనిసరిగా ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు జారీ చేసినా గుర్తింపు కార్డులు తమ వెంట తిసుకురావాలని, కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతి లేదని ఆయన తెలిపారు. ట్రాఫిక్ మళ్లింపులో భాగంగా ఏజెంట్లు, అభ్యర్థులు ఇబ్బందులుపడకుండా ట్రాఫిక్, పోలీస్ అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు అచ్చంపేట, నాగమల్లితోట, బానుగుడి జంక్షన్ల వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటుచేసి సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట అదనపు ఎస్పీ యంజేవీ భాస్కర్ రావు, జిల్లా రెవెన్యూ అధికారి డా.డి.తిప్పే నాయక్, అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.